# అల్కారజ్ X జొకో


**వింబుల్డన్ ఫైనల్లో టాప్ సీడ్‌లు ● ఆదివారం టైటిల్ పోరు**



లండన్: స్పెయిన్ నయా సంచలనం కార్లోస్ అల్కారజ్ వరుస విజయాల ప్రస్థానం దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఇటీవలే ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్‌తో మెరిసిన అల్కారజ్ తాజాగా..వింబుల్డన్‌లో ఫైనల్ పోరులోకి దూసుకెళ్లాడు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఈ 21 ఏండ్ల స్పెయిన్ నయాబుల్ తనకు తిరుగులేదని ఘనంగా చాటిచెప్పాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మూడో సీడ్ అల్కారజ్ 6-7(1-7), 6-3, 6-4, 6-4తో మెద్వదెవ్‌పై అద్భుత విజయం సాధించాడు. మూడు గంటల పాటు హోరాహోరీగా సాగిన పోరులో అల్కారజ్..మెద్వదెవ్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. మెద్వదెవ్‌కు తొలి సెట్ చేజార్చుకున్న అల్కారజ్ మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. కోర్టులో చిరుతను తలపిస్తూ వరుసగా మూడు సెట్లలో మ్యాచ్‌ను తన వశం చేసుకున్నాడు. ఈ క్రమంలో అల్కారజ్ 58 ఏస్‌లు కొడితే మెద్వదెవ్ 69తో ఆకట్టుకున్నాడు. మరో సెమీస్‌లో జొకోవిచ్ 6-4,7-6(7-2), 6-4 తేడాతో ముసెట్టీ (ఇటలీ)పై అలవోక విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించాడు.

# అండర్సన్ అల్విదా..

**సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌కు ఇంగ్లండ్ పేసర్ వీడ్కోలు**



లండన్: టెస్టుల్లో ఒక శకం ముగిసింది! తన అద్భుతమైన స్వింగ్ బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్ల వెన్నులో వణుకు పుట్టించిన ఇంగ్లండ్ స్టార్ పేసర్ జేమ్స్ అండర్సన్ ఆటకు వీడ్కోలు పలికాడు. తన రెండు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌కు గుడ్‌బై చెబుతూ క్రికెట్ మక్కాగా పేరొందిన లార్డ్స్ మైదానంలో ఆఖరి ఆట ఆడేశాడు. వెస్టిండీస్‌తో మూడు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టు ద్వారా ఈ స్టార్ పేసర్ అభిమానులు, సహచరుల సమక్షం అల్విదా చెప్పేశాడు. 2003లో లార్డ్స్‌లో జింబాబ్వేపై టెస్టుల్లో అరంగేట్రం చేసిన అండర్సన్ 188 మ్యాచ్‌ల్లో 26.45 సగటుతో 704 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. దీని ద్వారా ప్రస్తుత ప్రపంచ క్రికెట్‌లో ఏ పేస్ బౌలర్‌కు దక్కని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఇన్‌స్వింగ్, ఔట్‌స్వింగ్, రివర్స్ స్వింగ్ ఇలా బంతిని తన చేతివేళ్లతో అద్భుతం చేస్తూ లెక్కకు మిక్కిలి రికార్డులను సొంతం చేసుకున్నాడు. సచిన్, గంగూలీ, పాంటింగ్, ద్రవిడ్, లక్ష్మణ్, లారా, గిల్‌క్రిస్ట్, కలిస్ లాంటి ప్రపంచస్థాయి బ్యాటర్లను తన స్వింగ్ బౌలింగ్‌తో ముప్పుతిప్పలు పెట్టాడు. ముఖ్యంగా ఇంగ్లండ్‌లో డ్యూక్ బంతులను అండర్సన్ సంధించే తీరు చూస్తే ఎవరికైనా ఆహా అద్భుతం అనిపించకపోదు. టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మురళీధరన్ (800), వార్న్ (708) తర్వాత అండర్సన్ (704) మూడో స్థానంలో నిలిచాడు.

**ఇంగ్లండ్ ఘన విజయం:** వెస్టిండీస్‌తో తొలి టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 79/6 మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన విండీస్..136 పరుగులకు ఆలౌటైంది. అట్కిన్సన్(5/61), అండర్సన్(3/32) విజృంభించారు. 12 వికెట్లు పడగొట్టిన అట్కిన్సన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# సిరీస్‌పై గురి

**నేడు భారత్, జింబాబ్వే నాలుగో టీ20**



హరారే: యువ భారత్ టీ20 సిరీస్‌పై గురిపెట్టింది. జింబాబ్వేతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం నాలుగో మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో ఉన్న శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమ్‌ఇండియా మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తున్నది. సీనియర్ల గైర్హాజరీలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు కుర్రాళ్లు తహతహలాడుతున్నారు. తొలి పోరులో అనూహ్య ఓటమి తర్వాత పుంజుకున్న భారత్ వరుస విజయాలతో జోరుమీద ఉన్నది. యశస్వి జైస్వాల్, శాంసన్, శివమ్ దూబే రాకతో జట్టు మరింత పటిష్ఠంగా మారింది. గత మ్యాచ్‌లో గిల్, జైస్వాల్ ఇన్నింగ్స్ మొదలుపెట్టగా, వన్‌డౌన్‌లో అభిషేక్ బ్యాటింగ్‌కు వచ్చాడు. బౌలింగ్ పరంగా చూస్తే ముకేశ్‌కుమార్, అవేశ్‌ఖాన్, ఖలీల్ అహ్మద్ పేస్ త్రయానికి సుందర్, బిష్ణోయ్ స్పిన్ ద్వయం తోడైతే జింబాబ్వేను పడగొట్టడం పెద్ద పనికాకపోవచ్చు. జింబాబ్వే గత రెండు మ్యాచ్‌ల్లో పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. కెప్టెన్ రజా మినహా ఎవరికీ పెద్దగా అనుభవం లేకపోవడం జట్టు విజయ అవకాశాలపై ప్రభావం చూపిస్తున్నది.





# ప్రపంచ చెస్ పోటీలకు గురుకుల విద్యార్థులు

● **తెలంగాణ సోషల్ వెల్ఫేర్ నుంచే 5 మంది**

హైదరాబాద్, జూలై12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థులు తమ ప్రతిభతో మరోసారి అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ప్రపంచస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనబోతున్నారు. దేశవ్యాప్తంగా 9మంది విద్యార్థులు ఎంపికకాగా, అందులో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకులానికి చెందిన వారే 5 ఉండడం గర్వకారణం. ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ స్కూల్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆగస్టు 1 నుంచి 8వ తేదీ వరకు తాష్కెంట్(ఉజ్బెకిస్థాన్)లో జరగనున్నాయి. అండర్ 9, 11, 13, 15, 17 విభాగంలో నిర్వహించనున్న ఈ ప్రపంచ చెస్ పోటీల్లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా 9మంది విద్యార్థులు అర్హత సాధించారు. రాజ్‌కుమార్(ఇచ్చోడ), కత్రావత్ జగదీశ్(లింగాల), గణేశ్(నారాయణఖేడ్), మన్విత్(షేక్‌పేట), శ్రీలాస్య(తొర్రూర్) ఉన్నారు. విద్యార్థులు ప్రపంచ పోటీలకు ఎంపిక కావడంపై సొసైటీ కార్యదర్శి వర్షిణి హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ టోర్నీలో విద్యార్థులు సత్తాచాటాలని ఆమె ఆకాంక్షించారు.

# సింధుకు సులువైన డ్రా

● **పారిస్ ఒలింపిక్స్ గ్రూపులు ఖరారు**



కౌలాలంపూర్: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో బ్యాడ్మింటన్ డ్రాలు శుక్రవారం ఖరారయ్యాయి. డబుల్ ఒలింపిక్ చాంపియన్ పీవీ సింధుతో పాటు హెచ్‌ఎస్ ప్రణయ్‌కు సులువైన డ్రా ఎదురుకాగా, లక్ష్యసేన్, తనీషా క్యాస్ట్రో, అశ్విని పొనప్ప జోడీకి కఠిన ప్రత్యర్థులతో తలపడబోతున్నారు. మహిళల సింగిల్స్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 13వ ర్యాంక్‌లో కొనసాగుతున్న సింధు..గ్రూపు-ఎమ్‌లో క్రిస్టిన్ కుబా(ఈస్తోనియ), ఫతిమత్ నబా(మాల్దీవులు)తో కలిసి బరిలోకి దిగనుంది. మూడో ఒలింపిక్స్ పతకం కోసం పట్టుదలగా ఉన్న సింధుకు ప్రిక్వార్టర్స్‌లో చైనాకు చెందిన హీ బింగ్‌జియావో, క్వార్టర్స్‌లో చెన్ యుఫీ ఎదురు కానున్నారు. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్..గ్రూపు-కేలో ఉన్నాడు.





